సామాన్యులపై గ్యాస్ భారం



- సిలిండర్‌పై రూ.50 పెంపు
- నియోజకవర్గంలో రూ.36.74 లక్షల అదనపు భారం

గార్లదిన్నె: గ్యాస్ ధర పెంపుతో సామాన్య ప్రజలపై బండ బాదుడు పడింది. కేంద్ర ప్రభుత్వం ఒకే సారి రూ.50 పెంచడంతో గృహ వినియోగదారుల సిలిండర్ రూ.920కు చేరింది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకం పేరుతో గ్యాస్ సిలిండర్ ధర పెంచుతూ పోతుండటంతో సామాన్యులపై భారం పడుతూనే ఉంది. తాజాగా గ్యాస్ ధర ఒకే సారి రూ.50 పెరగడంతో రూ.870 ఉన్న సిలిండర్ రూ.920కు చేరింది. ధరలను అదుపులో పెట్టాల్సి కూటమి ప్రభుత్వం పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తుండడంతో పలువురు విమర్శిస్తున్నారు. మరో వైపు గ్యాస్ సబ్సిడీ కూడా గాలికి వదిలేశారు. సాధారణంగా గ్యాస్ ధర పెరిగే కొద్ది, సబ్సిడీ మొత్తం కూడా పెరగాల్సి ఉంది.

రూ.36.74 లక్షలు అదనపు భారం

గ్యాస్ సిలిండర్ ధర రూ.50 పెరగడంతో శింగనమల నియోజకవర్గంలో వినియోగదారులపై రూ.36.74 లక్షలు అదనపు భారం పడింది. సాధారణంగా సరాసరి 60 రోజులకు ఒక గ్యాస్ సిలిండర్‌ను వినియోగదారులు కొనుగోలు చేస్తున్నారు. గార్లదిన్నె, శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో సుమారు 73,492 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో దీపం కనెక్షన్లు కూడా ఉన్నాయి. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అదనంగా రూ.50 పెంచడంతో సామాన్య ప్రజలపై పెనుభారం పడింది. గృహ వినియోగదారులు సిలిండర్ బుకింగ్ చేసే సమయంలో ఒక ధర, ఫోన్లకు మెసేజ్ వచ్చిన, గ్రామాల్లో సిలిండర్ డెలివరీ సమయంలో బుకింగ్ ధర కంటే అదనంగా నగదు వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు గ్యాస్ ధర పెంచి బాదుతుంటే ఏజెన్సీ నిర్వాహకులు డెలివరీ చార్జీలతో అదనంగా వసూలు చేస్తున్నారని మహిళలు వాపోతున్నారు.

మోయలేని భారం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు పెంచుతూ ప్రజల మీద మోయలేని భారం వేస్తున్నారు. గ్యాస్ ధర పెంచితే సిలిండర్ కొని వంట చేసుకొని తినే పరిస్థితి లేదు. ప్రజలు ఒక్క పూట తిని పస్తులు ఉండే పరిస్థితి నెలకొంది. గ్యాస్ ధరలు పెంచుతూ ఉంటే మళ్లీ కట్టెలు తెచ్చుకొని వంట చేసుకునే పరిస్థితి వస్తోంది. – అఖిల,ఇల్లూరు

కట్టెల పొయ్యే నయం



గ్యాస్ సిలిండర్ ధర ఒకే సారి రూ. 50 పెంచడం దారుణం. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ రూ.920లకు చేరింది. సామాన్య ప్రజలు సిలిండర్ కొనలేరు. కట్టెల పొయ్యే నయం అవుతుంది. నిత్యావసర ధరలు పెరిగి అల్లాడిపోతుంటే మళ్లీ ప్రభుత్వాలు గ్యాస్ ధరలు పెంచడం పేద ప్రజలను కష్టాల్లోకి నెట్టడమే. – లక్ష్మీదేవి, కోటంక

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గుంతకల్లు ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎంయూఏ నాయకులు



తాడిపత్రిలో ధర్నా నిర్వహిస్తున్న నేషనల్ మజ్దూర్ యునియన్ నాయకులు

గుంతకల్లు టౌన్: ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఎర్రిస్వామి, డిపో అధ్యక్షుడు ఏఎల్ఎన్.గౌడ్ డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైన ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ గురువారం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో ఉద్యోగ, కార్మికులు ఎర్రబ్యాడ్జీలు ధరించి డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. 1–2019 సర్క్యులర్ అమలు చేయాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులు కల్పించాలని, అక్రమ సస్పెన్లను ఆపాలని, అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్న తమ న్యాయమైన డిమాండ్‌లను నెరవేర్చే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో డిపో మాజీ కార్యదర్శి డ్యామ్ వలి, నాయకులు గౌరమ్మ, కృష్ణ, రవికుమార్, మల్లికార్జున, వెంకటేశులు, ముక్తార్, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలను పరిష్కరించండి

తాడిపత్రి రూరల్: పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలంటూ గురువారం ఆర్టీసీ డిపో వద్ద నేషనల్ మజ్దూరు యునియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. రీజనల్ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ 1- 2019 సర్క్యులర్‌ను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. ఉద్యోగులకు పాత వైద్య విధానాన్ని అమలు చేయాలని తెలిపారు. గ్యారేజీలో నాణ్యత కలిగిన పనిముట్లను అందజేయాలన్నారు. అన్‌కాల్ డ్రైవర్లకు నెలవారి జీతాలు ఇవ్వాలన్నారు. అక్రమ సస్పెన్షన్లను ఆపాలని, మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో చైర్మన్ మహేష్, కండక్టర్స్ ప్రసిడెంట్ బాబు, రీజనల్ నాయకులు సుధాకర్, గ్యారేజీ సెక్రటరీ రామక్రిష్ణ, తదితరులు పాల్గోన్నారు.

ముందస్తు అడ్మిషన్లను అరికట్టండి



గుంతకల్లులో ఆర్డీఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లు/గుత్తి: ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ముందస్తు అక్రమ అడ్మిషన్లులకు అడ్డుకట్ట వేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు గుంతకల్లులో ఆర్డీఓ శ్రీనివాస్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలోకి తొక్కి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్నారన్నారు. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించకముందే నూతన విద్యా సంవత్సరానికి వేలాది రూపాయలు ఫీజుల వసూలు చేస్తూ పేద బడుగు బలహీన వర్గాల చెందిన విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు రోహిత్, శివమణి, ఫర్హాన్, జయప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే గుత్తిలో ఏఐఎస్ఎఫ్ నియోజవర్గ అధ్యక్షుడు వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ రవినాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్‌లు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తనీ్వర్, షమీర్, ఆఫీజ్, వెంకట సాయి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

‘సూపర్ సిక్స్’ పథకాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

గార్లదిన్నె: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని శింగనమల నియోజకవర్గం సీపీఐ ప్రధాన కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో యకులు సమా వేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం గడుస్తున్నా ఒక్క పథకం కూడా అమలు చేయలేదన్నారు. అలాగే లోకేష్ పాదయాత్రలో మర్తాడు గ్రామం లో చీనీ పండ్ల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చినా.. ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. అదేవిధంగా పేదలకు ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయలేదన్నారు. అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో మే 5న సీపీఐ మహా సభలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాథ్ చౌదరి,ం రామాంజనేయులు, వన్నూర్‌స్వామి, రామక్రిష్ణ, అంజినమ్మ, రాముడు, జగన్నాథ, శివయ్య, రామచంద్ర ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



తాడిపత్రిలో మద్దతు తెలిపిన వారికి పూల మాలలు వేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీరంగయ్య



యాడికి నుంచి తాడిపత్రికి బైక్ ర్యాలీగా బయలుదేరిన ముస్లింలు

తాడిపత్రి రూరల్/యాడికి: కేంద్ర ప్రభుత్వం ముస్లింలను అణచివేసే ధోరణిలో తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని తాడిపత్రి బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ప్రభుకుమార్ డిమాండ్ చేశారు. ఆయన అధ్వర్యంలో గురువారం పలువురు న్యాయవాదులు కలసి ముస్లిం జేఏసీ చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతిచ్చారు. పట్టణంలోని సిద్ధిబాషా దర్గా వద్ద దీక్షా శిబిరానికి వచ్చి మద్దతు తెలిపారు. న్యాయవాదులు సాహుల్, అఫాక్, పర్వీన్, అంజాద్‌బాష, హనీఫ్,, అబ్బాస్, మహబూబ్‌బాష, శివరామక్రిష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

మద్దతిచ్చిన ఫయాజ్‌బాషా

దీక్షలకు మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాషా మద్దతిచ్చారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చట్టాన్ని రద్దు చేసేవరకు ముస్లీం జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రిలే నిరాహార దీక్షలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు, రజక సంఘం రాష్ట్ర కార్యదర్శి గూడూరు లక్ష్మీరంగయ్య అనుచరులతో కలిసి మద్దతు ప్రకటించారు. అలాగే రిలే నిరాహార దీక్షలకు యాడికి మండల కేంద్రంతో పాటు మండలంలోని రాయలచెరువు మసీదుల నుంచి ముస్లింలు బైక్‌లలో ర్యాలీగా వచ్చి దీక్షకు మద్దతు తెలిపారు.

నరసింహస్వామి ఆలయంలో పూజలు



నవ అహోబిలం నరసింహస్వామి ఆలయం

గుత్తి: మండలంలోని కొత్తపేట గ్రామ సమీపంలో దాతల విరాళాలు రూ.1.45 కోట్లతో నిర్మించిన నూతన నవ అహోబిలం నరసింహస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు మూడు సంవత్సరాలు శ్రమించి ఆలయాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాత , అహోబిలం లక్ష్మినరసింహస్వామి వీర భక్తుడు, ఓబులరెడ్డి స్వామి మాట్లాడారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. మొదటి రోజు గురువారం హోమాలు, చిన్న పిల్లల చేత భరతనాట్యం, రెండో రోజు శుక్రవారం కలశ స్థాపన, మూడో రోజు శనివారం ప్రాణ ప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేయనున్నామన్నారు. ఈ సందర్భంగా స్థల దాతలు ఆదినారాయణ, రాముడు, రామమూర్తి, కృష్ణమూర్తిని సన్మానించారు.

వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలి

గార్లదిన్నె: కెనరాబ్యాంకులో వడ్డీ కట్టించుకొని క్రాప్ లోన్లు రెన్యూవల్ చేయాలని రాయలసీమ రైతు సంఘం నాయకులు కోరారు. గురువారం రాయలసీమ రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించడంతో గార్లదిన్నెలోని కెనరా బ్యాంకులో రైతుల క్రాప్ లోన్లు, బంగారు రుణాలు వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని బ్యాంకు మేనేజర్ వీఎస్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్, పాపిరెడ్డి, శ్రీరాములు, నీలకంఠ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

‘చేబ్రోలు కిరణ్‌ను కఠినంగా శిక్షించాలి’

తాడిపత్రిటౌన్: టీడీపీ కార్యకర్త చేబ్రోలు కిరణ్‌ను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధానకార్యదర్శి పేరం స్వర్ణలత డిమాండ్ చేశారు. గురువారం ఆమె తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన భార్య భారతిపై అనుచిత వాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి పలు ఘటనలు చోటు చేసుకోవడం సిగ్గుచేటన్నారు. టీడీపీ ప్రభుత్వంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

గుత్తి: మండలంలోని కె.ఊబిచెర్లకు చెందిన నారాయణమ్మ అనే వృద్ధురాలు గురువారం విష రసాయనం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను కుటుంబ సభ్యులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

మేకకు హెర్నియా శస్త్ర చికిత్స

శింగనమల: శింగనమలకు చెందిన రామాంజనేయులు మేకకు స్థానిక పశువైద్యశాల సహా సంచాలకుడు పద్మనాభం హెర్నియా శస్త్ర చికిత్స చేశారు. మేకకు కొన్ని రోజుల క్రిందట ఉదర కండరం తెగిపోయి కడుపులో నున్న పేగులు తెగిన కండరంలో చర్మం కిందకు జారడం ప్రారంభించాయి. ఇవి ఎక్కువై పెద్ద గడ్డలాగా ఏర్పడడంతో, శింగనమల పశువైద్యశాలకు తీసుకవచ్చారు. అక్కడ పశువైద్యశాల సహాయ సంచాలకుడు పద్మనాభం పరిశీలించి, మేకకు హెర్నియా శస్త్రచికిత్స చేశారు. ప్రస్తుతం మేక ఆరోగ్యకరంగా ఉందని కాపరి అన్నారు.

ప్రజల ప్రాణాలు తీస్తున్న ఫైనాన్స్ కంపెనీలు

గుంతకల్లు: ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు పేద ప్రజల తీస్తున్నాయని సీపీఐ నాయకులు ఆరోపించారు. గురువారం స్థానిక అంజతా సర్కిల్ సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రూరల్, పట్టణ కార్యదర్శులు రాముడాయల్, గోపీనాథ్ మాట్లాడుతూ ఫైనాన్స్ కంపెనీలు అధిక వడ్డీలతో ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. జీ కొట్టాలకు చెందిన దళితులు ఫైనాన్స్ కంపెనీల్లో అప్పులు తీసుకుని వడ్డీలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణంలోని ఫైనాన్స్ కంపెనీలపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాధితులు పెద్దక్క, భవాని, సరోజచ ఆదిలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

‘వేంకటేశ్వర డిగ్రీ కాలేజీ అనుమతి రద్దు చేయాలి’

గుంతకల్లుటౌన్: టెన్త్, ఇంటర్, డిగ్రీ దూరవిద్య కోర్సుల పేరిట విద్యార్థుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్న శ్రీవేంకటేశ్వర డిగ్రీ కాలేజీ అనుమతిని ప్రభుత్వం రద్దు చేయాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వంశీయాదవ్ డిమాండ్ చేశారు. దూరవిద్య కోర్సులకు చేరిన విద్యార్థులకు గ్యారెంటీ పాస్ పేరిట ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దోపిడీకి పాల్పడుతున్న కాలేజీ కరస్పాండెంట్‌పై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. గతంలో ఈ కాలేజీ బాగోతంపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామన్నారు.

బైక్ బోల్తా.. యువకుడికి గాయాలు

గుత్తి: మండలంలోని జక్కల చెరువు గ్రామ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని, ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గుత్తిలోని జంగాల కాలనీకి చెందిన అశ్వ విజయ్ బైక్‌లో తాడిపత్రికి బయలు దేరాడు. మార్గమధ్యంలో బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

క్లుప్తంగా

ఘనంగా ధన్వంతరీ హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ ఆవరణలో గురువారం ధన్వంతరీ హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో ఆంజనేయ స్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ధన్వంతరీ హోమాన్ని నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

కానిస్టేబుల్ పరీక్ష తేదీ ప్రకటించాలి



మాట్లాడుతున్న జిల్లా కన్వీనర్ రమేష్

గుంతకల్లుటౌన్: కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్ష తేదీని వెంటనే ప్రకటించాలని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ రమేష్, పట్టణ కార్యదర్శి సురేంద్ర డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కానిస్టేబుల్ పరీక్ష రాయనున్న అభ్యర్థులకు కూటమి ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపుతోందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాం (2022)లో నోటిఫికేషన్ ఇచ్చినా ఇప్పటికీ పరీక్షలు నిర్వహించి ఆ పోస్టులను భర్తీ చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కోర్టు కేసులు క్లియర్ చేయించి పోస్టులు భర్తీ చేస్తామని, యువగళంలో లోకేష్ హామీ ఇచ్చి నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. వెంటనే మెయిన్స్ పరీక్షను నిర్వహించి ఉద్యోగాలను భర్తీ చేయకపోతే ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

యల్లనూరు: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కింద మంది గర్భిణులకు వైద్య పరీక్షలు అందించినట్లు వైద్యులు శివసాయి, లోకేష్‌కుమార్‌లు తెలిపారు. ప్రతి నెలా గర్భిణులు వైద్య పరీక్షలతో పాటు రక్త పరీక్షలు, స్కానింగ్ చేయించుకోవాలన్నారు. రోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మధుకుమార్, సూపర్‌వైజర్ హాజీవలి, జైనూబీ, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

గుంతకల్లు రూరల్: రైతులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్‌పుస్తకాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ రమాదేవి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. గుంతకల్లు మండల వ్యాప్తంగా 800 మంది రైతులు పట్టాదారు పాస్ పుస్తకాలను ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాల్సి ఉందన్నారు. రైతులు సంబంధిత సచివాలయంలో వీఆర్వోలను కలసి ఆధార్ అనుసంధానం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల వ్యాప్తంగా 11 వేల మంది రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ–కేవైసీ నమోదు చేయించుకోవాల్సి ఉందన్నారు. లబ్ధిదారులు ఈ–కేవైసీ నమోదు చేయించుకోని పక్షంలో రేషన్ సరుకులతోపాటు, సంక్షేమ పథకాలను కోల్పోతారన్నారు.

మానవత్వం చాటారు!



మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలిస్తున్న ఆ నలుగురు సేవాసమితి సభ్యులు

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రిలో మృతిచెందిన గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహానికి ఆ నలుగురు సేవాసమితి సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటారు. టూటౌన్ పోలీసుల విజ్ఞప్తి మేరకు గురువారం ఉదయం ప్రభుత్వాస్పత్రి మార్చురీలోని వృద్ధుడి మృతదేహాన్ని పాతగుంతకల్లులోని హిందూ శ్మశానవాటికకు తరలించి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ఆ నలుగురు సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మంజుల వెంకటేష్, కోశాధికారి ప్రదీప్‌ఆచారి, సభ్యులు స్నేహ, భాగ్యరాజ్, రవీంద్ర, వంశీ, శ్రీనివాసులు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్ష తేదీలో మార్పు

తాడిపత్రి/యల్లనూరు/పామిడి: ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశాలకు సంబంధించి ప్రవేశ పరీక్ష తేదీ మార్పు చేసినట్లు గురువారం తాడిపత్రి పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య, యల్లనూరు ఎంఈఓ–2 పరమేశ్వరరెడ్డి, పామిడి ప్రిన్సిపాల్ అరుణ తెలిపారు. ఈమేరకు గురువారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఈ నెల 20 న ఈస్టర్ పండుగను పురస్కరించుకుని ప్రభుత్వ సెలవు దినం కావడంతో, ఆ రోజు జరగాల్సిన ప్రవేశ పరీక్ష ఈ నెల 21న నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

పెద్దవడుగూరు: సర్వేయర్లు అంకితభావంతో పని చేయాలని తహసీల్దార్ ఉషారాణి సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ సర్వే దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విధులను సక్రమంగా నిర్వహించి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. అనంతరం విలేజ్ సర్వేయర్లకు టోపీ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వరమ్మ, రీ సర్వే డీటీ జయమ్మ, మండల సర్వేయర ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కూలిన మిద్దె

- దంపతులకు తీవ్ర గాయాలు

పామిడి: మండలంలోని పి.కొండాపురం గ్రామంలో మట్టి మిద్దె కూలడంతో అందులో నివాసముంటున్న గొల్ల కృష్ణయ్య, లక్ష్మి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. వారి ఏడు నెలల వయసున్న చిన్నారి సురక్షితంగా బయటపడింది. వివరాలు... వ్యవసాయ కూలి పనులతో జీవనం సాగిస్తున్న కృష్ణయ్య.. రోజు వారీ కార్యక్రమంలో భాగంగా బుధవారం కూలి పనులకు వెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారు. భోజనం ముగించుకున్న అనంతరం మిద్దె ఇంట్లోనే నిద్రించారు. గురువారం వేకువ జాము 3 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా మిద్దె కూలింది. శబ్ధానికి చుట్టుపక్కల వారు నిద్రలేచి అక్కడకు చేరుకున్నారు. శిథిలాల కింద చిక్కుకున్న లక్ష్మి, కృష్ణయ్యను వెలికి తీశారు. లక్ష్మికి ఎడమ కాలు విరిగింది. కృష్ణయ్య నుదురు భాగం, తలకు, ఛాతీకి బలమైన గాయాలయ్యాయి. చిన్నారి హారిక సురక్షితంగా బయటపడింది. క్షతగాత్రులను వెంటనే ఆటోలో పామిడిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం 108 అంబులెన్స్‌లో అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న తహసీల్దార్ ఎస్ శ్రీధర మూర్తి ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, నివేదిక సిద్ధం చేశారు.

భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడాలి

గార్లదిన్నె: పంటలకు భూసార పరీక్షలు ఆధారంగా రైతులు ఎరువులు వాడాలని అనంతపురం భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి శ్రీనాథ్‌రెడ్డి సూచించారు. గురువారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో భూసార పరీక్ష, మట్టి నమూనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పొలాల్లో అరుతడి పంటలకు మూడు సంవత్సరాలకు ఒకసారి, నీటి వసతి ఉండే పొలాల్లో మూడు పంటలకు ఒకసారి మట్టి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అలాగే రైతులు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు కావాల్సిన మోతాదు కన్నా అధికంగా వాడటం వల్ల చీడ, పీడ సమస్యలు వచ్చి, భూమి నిస్సారవంతమై దిగుబడులు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈఓ స్రవంతి, వీహెచ్ఏ గుల్ఫరేష, ఎంపీఈఓలు తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ విజేత బీకేఎస్ జట్టు



గెలుపొందిన బుక్కరాయసముద్రం జట్టుకు కప్‌ను అందజేసిన కల్లుమడి గ్రామస్తులు

శింగనమల: మండలంలోని కల్లుమడి గ్రామంలో 12 రోజుల పాటు నిర్వహించిన క్రికెట్ టోర్నీలో గురువారం జరిగిన ఫైనల్ పోటీల్లో బుక్కరాయసముద్రం జట్టు విజయం సాధించింది. గెలుపొందిన జట్టుకు గ్రామస్తులు కప్‌తో పాటు రూ.30 వేలు అందజేశారు. రెండవ బహుమతిని పామిడి కొత్తపల్లి జట్టు గెలుచుకుంది. వారికి రూ.10 వేలు, కప్ అందజేశారు. కాగా క్రికెట్ పోటీలో 30 జట్లు పాల్గొన్నాయి.

వ్యక్తి మృతి



వడ్డే శివకుమార్ (ఫైల్)

పామిడి/గార్లదిన్నె: పామిడి పట్టణంలోని వడ్డే వీధికి చెందిన శివకుమార్(42) గురువారం మృతి చెందాడు. ఇటీవల గార్లదిన్నె వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్సకు సహకరించక బుధవారం అర్ధరాత్రి అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రిలో మృత్యు ఒడికి చేరాడు.